
# మా వూరికి సొతంత్రం రాలేదు

— మహీపాల్



ఊరు అప్పుడే నిద్రనుండి మేల్కొంటుం దేమో !

మబ్బును చీల్చుకుంటూ కాంతి నెమ్మదిగా ఆవరించుకుంటోంది. ఆకాశంలో మబ్బులు తేరుకొని హడావిడిగా వేగంగా పరిగెడుతున్నాయి. పతులు పట్టలేని సంతోషముతో సంగీతాన్ని తలపించటం ప్రారంభించాయ్. ఎప్పుడూ లేని కాంతి ఈ రోజు మరీ దిట్టంగా ఉంది. చిరు నవ్వును చిలకిస్తున్నవాడిలా ఆకాశాన్ని ప్రాకుతూ ''ఈ రోజు నన్ను చూడండి'' అనుదీమాతో బంగారు తీగల్లా కాంతి రేఖలు ప్రసరింపజేస్తు వస్తున్నాడు.

''జై బోలో స్వతంత్ర భారత్‌కి జై'' అన్న నినాదాలతో ఆ వూరు కలకలలాడుతోంది. మూడు రంగుల ముచ్చటైన జెండాలు వీధి వీధినా రెపరెపలాడుతున్నాయి. ఈ రోజు ఆకాశం మరింత పెద్దదిగా విశాలంగా, చూడ ముచ్చటగా కన్పిస్తోంది. చిన్న చిన్న పిల్లలంతా క్రొత్త బట్టలు వేసుకొని కేరింతలు కొడుతూ, మురిసి పోతూ వేగంగా ఊరి చివరనున్న స్కూలు వైపు పరిగెడుతున్నారు. ఆ వూరి పెద్ద బజారు రంగు రంగుల కాగితాల్తో అమర్చి యున్నది. మైకులో దేశభక్తి గేయాల హోరు బాగా వినవస్తున్నాయి. బహుశా అక్కడే ఉందేమో ఆ గ్రామ పంచాయతీ కార్యాలయం, చిన్న పెద్దా అంతా అక్కడ చేరి గుంపుగా ఏవో సన్నాహాలు చేస్తున్నారు. నిగనిగలాడే తెల్లని బట్టల్తో ఏవో కబుర్లు చెప్పుకుంటున్న గ్రామ పెద్ద మనుషులుకూడా కనిపిస్తున్నారు. బుర్రమీసాలతో గాంభీర్యాన్ని ప్రదర్శించే కళ్లతో, చేతిలో ఓ కర్రతో నెమ్మదిగా వస్తున్న ఆ ఖద్దరు బట్టల నాయకుడు. అతను రాగానే కూర్చున్న వారంతా లేచి వంగి నమస్కారాలు చేశారు. బహుశ అతడు సర్పంచ్‌గారేమో అతనే స్వయానా ఆ గ్రామ పంచాయతీ కార్యాలయమున అలంకారాలు చేయించడం ప్రారంభించాడు. ఇంతలో పెద్ద నినాదాలతో ఊరేగింపుగా, బ్యాండ్ మేళాలతో, మధురమైన దేశభక్తి గేయాలు పాడుకుంటూ బడిపిల్లలంతా వరుసకు ముగ్గురు చొప్పున నిలబడి బారులు తీరి వస్తున్నారు. ఆ బడి పిల్లలు పాటలు వినాలని, గుమ్మాలుదాటి పరుగున వచ్చి చూస్తున్నారు ఆడపడచులు. వారి ఊరేగింపు పాటల్ని చూసి ముచ్చటపడిపోతున్నారు.

వరుసగా బారులుతీసి ఆడుతూ పాడుతూ పోతున్న ఆ బడి పిల్లల్ని ఆశగా చూశాడు. ''నేనుకూడా వాళ్లతోపాటు ఉంటే ఎంత బావుండు, నేనుకూడా కొత్త బట్టలు వేసుకొని వారి వెంట బడికెళితే ఎంత బావుండు, నేను కూడా వాళ్లతోపాటు ఆడుతూ పాడితే మరెంత బావుండో, నేనుకూడా వాళ్ళతోపాటు పిప్పర మెట్లు తింటే ఎంతో బావుండేది'' అలా ఆశల పల్లకీలో విహరిస్తూ ఊరేగింపుగాపోతున్న ఆ బడి పిల్లలనంతా ఆత్రుతతో, ఆనందముతో చూస్తున్నాడు. అతనిక్కూడా ఆడాలని వుంది. పాడాలని వుంది. కాని మళ్ళీ ఏదో నిరాశ అతన్ని దహించివేస్తుంది వాళ్లతోపాటు బడికిపోవాలని ఆశ మరింత రెచ్చిపోతోంది.

''ఈ రోజు ఏదో పండగంట, అందుకు వాళ్లు ఆడుతున్నారు పాడుతున్నారు. మరి నేను పండగ రోజుకూడా !'' తనకుతాను ఒకసారి ఎగాదిగా, ఆ చిరిగిపోయినబట్టల్నిచూసి నిరుత్సాహ పడిపోయాడు.

''ఈ పండగ మనకి కాదేమో, పెద్ద పెద్ద దొరబాబులకు, పెద్ద పెద్ద దొరకొడుకులకేమో'' అనుకున్నాడు. మళ్లీ ఆ అనుమానాన్ని నెట్టి వేసుకుని ''నెనెలాగైనా ఈ రోజు పని మానేస్తాను'' తన మనసులో నిర్ధారించుకొని ఊరికి ఎడమ ప్రక్క దిశలో ఉన్న గుడిసెలవైపు పరుగు తీసాడు.

''అయ్యా, అయ్యా !'' బాగా పరిగెత్తి అలసిపోయినవాడిలా దమ్ముతీస్తు ఆదుర్దాగ అరచుకుంటూ పూరిగుడిసె దగ్గరకు చేరు కున్నాడు. పూరిగుడిసెపై తాటి కమ్మలను సర్దుతున్న ఆ నడివయసు మనిషి వీడివైపు కంగారుగా చూశాడు.

''ఏంట్రా మళ్లీ ... ఇంకా నువ్వు పనికి పోలేదంట్రా ? ఓరి ఎదవ సన్నాసి ... ఈడికే పొద్దుపోనాది, ఆ దొరసానమ్మగోరు తిడతారు ఎళ్లెళ్లు'' కసిరాడు.

ఆ మాటలు విన్న ఈ చిన్నారి మనసు చిన్నబోయింది. వాడి మొహం పేలబోయింది. ఏదో చెప్పబోయాడు. ఏదో అడగాలని ఆశతో అతనివైపు చూశాడు.

''అది ... అది... అదికాదయ్యా . ఇవ్వాళ ఏదో పండగంట ?'' భయంతో పూర్తిగా చెప్పలేకపోతున్నాడు. అందుకు సమాధానంగా ఆ మనిషి పక్కున నవ్వాడు.

''ఏం పండగయితే నీకేట్రా, ఆ పండుగ మనక్కాదెసె ఎళ్లెళ్లు, దొరసానమ్మగారు కోప్పడతారు'' ఉరమాయించాడు

''అదికాదయ్యా .. ఆ బడి పోరగాళ్లు కూడా మంచి బట్టలేసుకొని ఆడుతూ పాడుతూ పోతున్నారుగా .. ఇదేం పండగయ్యా'' మళ్లీ అడిగాడు వణుకుతున్న కంఠముతో. ఈసారి మళ్లిగాడివైపు కోపంగా చూశాడు. ఆ కోపాన్ని అంతలో దిగమ్రింగాడు.

''ఈవేళ సొతంత్రం వచ్చిందంటా ...


... ఆ తల్లి దొరలను తరిమికొట్టి మన కష్టాలు లేకుండా చూసిన రోజన్నమాట. అందుకే, అందరూ ఈరోజు పనులు మానేసి ఇంటిదగ్గరే ఉంటారు. మరి బడిపిల్లలేమో ఆటలాడుతూ, పాటలు పాడతారు. ఇవన్నీ నీకెందుకురా. నువ్వెళ్లరా .. ఏ పండగయినా మనకు రెక్కాడితే గాని డొక్కాడదు. ఆ దొరసానమ్మగారు కోపమొస్తారు ఎళ్లరా !'' బ్రతిమిలాడినట్టు చెప్పాడు.


''అయ్యా... '' చెప్పలేక సందేహపడుతూ గాబరాగా చూస్తున్నాడు.

''మళ్ల ఎందిరా ... నీకియ్యాల ఏం రోగం పుట్టిందిరా ?'' తాటి కమ్మలను సర్దేసి మల్లిగాడివైపు కోపంగా చూశాడు.

''అయ్యా ... ఇవేళ నేను కూడా .. !'' భయంగా అతనివైపు చూస్తూ నోరు మెదప లేకపోతున్నాడు.

''ఏంటీ తొరగా సెప్పేసావరా ?''





''అయ్యా ఈవేళ నేను కూడా పనికి మానేసి ఆడుకుంటానే !'' ఎలాగో చెప్పేసి అక్కడ్నుంచి పరుగుతీసి, వాకిట్లో కళ్లాపు చల్లుతున్న తల్లిచాటు కెళ్లాడు. ఈ మాట విన్న వాడయ్య కోపంతో రెచ్చిపోయాడు

''ఓరి ఎధవ సన్నాసి ... ఈ వేళ పనికి వెళ్లకపోతే ఆ దొరసానమ్మగారు రోజువేసే ఆ రెండు ముద్దలు కూడా ఎయ్యరు !'' ప్రక్కనే ఉన్న తాటిమట్టను చేతిలోకి తీసుకున్నాడు.

తల్లి చాటున దాక్కున్న మల్లిగాడు గజగజ వణికిపోతున్నాడు. తల్లి కాళ్లను దగ్గరగా అదిమి పట్టుకున్నాడు. తనవేపే వస్తున్న అయ్య వైపు చూసి భయంతో కంపించిపోయాడు.

''అమ్మా... అమ్మ... అయ్య కొడ్తందుకు వత్తన్నాడే... అమ్మ.. కొట్టొదని సెప్పవే.. నేనీ రోజు పనికి పోనే !'' గోలగా అరుస్తున్నాడు. లేని దుఃఖాన్ని తెచ్చుకొని కేకలు వేస్తున్నాడు.

''నీకిదేం పోయే కాలంరా... ఈరోజు పనికి పోనంటావే. ఈవేళ ఆ దొరసానమ్మ గారింట్లో పని శానా ఉంటది. ఏదో ఆ దొరసానమ్మగారి చలవవల్ల ఈ నీడలో డొక్కలు నిండుతున్నాయి. నువ్ పన్కెళ్ల నాన్న'' కళ్లాపు బుడ్డిని ప్రక్కనే వున్న ఎర్రమట్టి దిబ్బపై పడేసి వాన్ని బుజ్జ గించపోగింది.

''వాడ్ని బుజ్జగిస్తావేందే .. వాడివ్వాళ పన్కెళ్లకపోతే ఈ తాటిమట్ట ముక్కలై పోదూ !'' ఇంకా దగ్గరకు వస్తున్న అయ్యను చూసి సింహం చేతిలో చిక్కిన మేకలా వణికి పోతున్నాడు. తన మొండిపట్టు విడవకుండా—

''మరి .. ఈరోజు అందరు పనులు మానేస్తారు కదనే. నేను కూడా ఎందుకు మానెయ్యకూడదే !'' ఎదురు ప్రశ్న వేశాడు వణుకుతున్న కంఠముతో.

''నువ్ పక్కకు తొలగవే .. వాడేమో శానా శానా మాటాడుతున్నాడు '' తల్లిచాటున దాగివున్న వాణ్ణి ఒక చేత్తో బయటికి గట్టిగా లాగాడు.

''నేను పోను...ఈ వేళ నేను పనికి పోను నేను కూడా ఈవేళ ఆడుకుంటాను!'' ధైర్యాన్ని కూడదీసుకొని అరుస్తు అన్నాడు మల్లి అంతే, అతని వీపుపై తాటిమట్ట దెబ్బలు మారు మ్రోగుతున్నాయి. ఆ దెబ్బలకు తాళలేక గావుకేకలు పెడుతున్నాడు.

''నేనీ వేళ పనికి పోను !'' అంటూ ఏడుస్తాడేతప్ప ''పనికి పోతా'' అని అనటంలేదు. కోపాన్ని మరింత రెట్టింపు చేసుకొని ఆ మనిషి దయ, జాలి విస్మరించి రాక్షసుడిలా చావబాదు తున్నాడు.

మల్లిగాడు పెడుతున్న ఆ చావుకేకలకు చుట్టుప్రక్కల గుడిసె వాసులు కూడా పోగయ్యారు, కాని ఎవ్వరూ అడ్డు తగలడం లేదు. వాడి బాధను చూడలేక పోయింది ఆ కన్న కడుపు. మొత్తుకుంటూ వచ్చి అతని చేయి పట్టుకుంది. ఆమెను కూడా రెండు దెబ్బలేసి పక్కకు నెట్టివేసాడు. అయినా మల్లి పట్టు విడవకుండా అలాగే అరుస్తూ ఏడుస్తున్నాడు.

''వద్దయ్య ... ఆడ్ని కొట్టకు... ఆడ్ని చంపకు !'' మళ్లీ వచ్చి అతని కాళ్లపైబడి గట్టిగా పట్టుకుంది.

''ఏమిటే... వాడ్ని ఎనకేసు కొస్తావ్ ... వాడేమో పనికి పోనంటాడు. ఇదేంటే మీ తల్లీ కొడుకుల వరస!'' కోపం తాపమెరుగదు అన్నట్టు మల్లిగాడ్ని వదిలేసి ఆమెను కొట్టడం మొద లెట్టాడు ఆ చుట్టు గూడిన వాళ్లు ఇక చూడలేక అతన్ని పట్టుకొని ఎక్కడికో లాక్కుపోయారు. ఆడి తల్లి ఏడుస్తూ గుడిసె లోపలికెళ్లింది. మళ్లీ కొడ్తాడేమోనని భయపడ్డ మల్లిగాడు ఊరి బయటకు పరుగుతీసాడు.

* * *

స్కూలు ఆవరణ అంతా ఆటపాటలతో కళకళలాడుతుంది. ఆవరణ మధ్యలో రెపరెప లాడుతున్న ఆ మూడు రంగుల జెండాతో మరింత వెలుగునిస్తుంది ఆ స్కూలు. ఆ స్కూలు గదుల ముఖద్వారం దగ్గర రంగు రంగుల కాగితాలు అతికించబడి వున్నాయి. కాగితాల తోరణాలు ఆ ఆవరణ మధ్యలో ఉన్న జెండా చుట్టూ గుండ్రంగా కట్టబడి మరింత ఆకర్షణీయంగా కనపడుతుంది. ఆ ఊరులో



"తరతరాలుగా మా కుటుంబంలో అందరం అయొడెక్స్‌నే నమ్ముకున్నాం..." అంటున్నారు గుమ్మడి.

నొప్పా? బెణికిందా? కండరాలు పట్టాయా? కీళ్ళు పట్టాయా? వీటన్నిటినీ నయం చేసేది అయొడెక్స్. నొప్పిని తగ్గించడం అన్నది అయొడెక్స్ యొక్క లక్షణం. అయొడెక్స్‌ని రుద్దుతుండగానే నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది. లోపల, దెబ్బతగిల పొరలు నయం కావడానికి మందంతా లోపలికి చొచ్చుకు పోయేందుకు అయొడెక్స్‌ని బాగా రుద్దండి. బాధ తగ్గినా కూడా అదే విధంగా అయొడెక్స్‌ని పదేపదే రాస్తూ వుండండి.

| | అయొడెక్స్ |
|---|---|
| ధాతువు (లోపలి పొర) దెబ్బతినడం | ✓ |
| నొప్పులు | ✓ |
| బెణకడం | ✓ |
| కీళ్ళు పట్టడం | ✓ |
| కండరాలు పట్టడం | ✓ |
| నడుం నొప్పి | ✓ |

అయొడెక్స్®

మిమ్మల్ని మళ్ళీ చురుకుగా పనిచేసేలా చేస్తుంది.




LINTAS IODEX 71 232 TL


# మావూరికి సౌతంత్రం....

ఉన్న చిన్నా పెద్దాఅంతా గుంపులు గుంపులుగా చేరి ఆ పిల్లలు ఆడుతున్న ఆటలను ఆనందముతో ఉత్సాహముతో చూస్తూ చప్పట్లు కొడుతున్నారు. మరొక వైపు బహిరంగ సభలో పలువురు రాజకీయ నాయకులు గొప్పగా ఉపన్యసిస్తుంటే కూర్చున్న వాళ్ళంతా ఆత్రుతగా వింటున్నారు.

చావుదెబ్బలు తిన్న మల్లిగాడు వెక్కివెక్కి ఏడుస్తూ ఆ వాతావరణంలోకి అడుగు పెట్టాడు. చుట్టూ అంతా కలియచూశాడు. ఆకాశములో తేలుతున్నట్టు అనిపిస్తున్న ఆ జాతీయ జెండావైపు చూడబోయి ఆ సూర్య కిరణాల ప్రభావం వల్ల చూడకుండా విఫలుడైనాడు. పిప్పరమెంట్లు ఎక్కడైనా పంచుతున్నారేమోనని ఆశగా చూశాడు. ఎక్కడా కన్పించలేదు. నిరాశతో మొఖాన్ని దించుకున్నాడు.

అయ్య కొట్టిన దెబ్బలో ఒళ్ళంతా హూనంగా తయారయి నొప్పులు పుడుతున్నాయి. పెదవులు పిడచ కట్టుకుపోయాయి. నెత్తంతా చెల్లాచెదురుగా గాలికి నృత్యం చేస్తున్నాయి. మొహమంతా కన్నీళ్ళతో చారికలు కట్టింది. వెక్కిళ్ళు ఇంకా వస్తూనే వున్నాయి వాడి గొంతునుండి. కళ్ళలో ఎర్రచారలు పేర్కొన్నాయి.

"ఈ చిరిగిపోయిన బట్టల్తో వాళ్ళ దగ్గరికెళ్తే ఏమైనా అంటారేమో"నని బాధపడ్డాడు. నిరాశతో కృంగిపోయాడు.

"ఏమైనా సరే నేను ఆడతాను, పాడతాను" అనే కోరిక దృఢంగా నాటుకుపోయింది. "చెమ్మటాల గుడుగుడు" ఆడుతున్న పిల్లలవైపు వెళ్ళాడు నీరసంగా తన శరీరంనిండా తాటిమట్టల అచ్చులే కన్పిస్తున్నాయి తన మొండిపట్టే ఇంతవరకు తెచ్చిందేమోనని బాధపడ్డాడు. శరీరంమీద అక్కడక్కడా రక్తం చారికలు కూడా ఏర్పడ్డాయ్. కొడుతుంటే చేయి అడ్డుపెట్టాడేమో అర చేయంతా ఎర్రగా బొబ్బలెక్కి వాచివుంది.

ఆ ఆట చుట్టూ చూడరాకుండా మనుషులు నిల్చొని ఆటలో లీనమై ఈలలు వేస్తున్నారు. మరొకవైపు బహిరంగ సభలో ఎవరో ఏదో గొప్పగా ఉపన్యసిస్తున్నారు. అక్కడ పాటలు పాడతారేమో వినాలన్న ఆత్రుతతో నెమ్మదిగా అటు వైపు నడక సాగించాడు. అక్కడికి చేరుకునేసరికి ఓ నాయకుడు మాట్లాడటం ముగిసింది. ఇద్దరమ్మాయిలు ఆ వేదిక పైకివచ్చి "గాంధిపుట్టిన దేశం" అంటూ పాడటం మొదలెట్టారు. ఆ పాట పాడుతున్న ఆ అమ్మాయిల వంక కొండంత ఆశతో, తన చెవుల్ని పెద్దవిగా చేసి మైమరచి వింటున్నాడు. వాళ్ళాపాట పాడి వేదిక దిగిపోయారు. మళ్ళీ

ఆ పాట పాడితే ఎంత బావుండు అనుకున్నాడు. నెమ్మదిగా తనుకూడా మనసులో పాడుకో బోయాడు. ఆ వెక్కిళ్ళకు ఆ పాట ఎదరువు రావడంలేదేమో ఊరుకున్నాడు.

"నేనుకూడా వాళ్ళలాగే పాటపాడాలి కాని నన్నెవరు పాడనిస్తారు. నేనేమో చాలా పేదోన్ని కదా, మరి నాకు సరిగ్గా బట్టలు లేవుకదా, వాళ్ళేమో కొత్త బట్టలు వేసుకొని నున్నగా దువ్వుకొని చందమామల్లా వచ్చి పాడుతున్నారు. మరి నేను చిరిగిపోయిన బట్టలు, మాసిపోయిన జుట్టు, ఎండిపోయిన మొహం అదీగాక నేను బడికి కూడా పోవటం లేదాయె, అయిన నేనేం పాట పాడతాను ?"! పలురకాలుగా ఆలోచిస్తూ, ఆ ఆలోచనల్లో గుళ్ళు కడుతూ వెంటనే కూల్చేస్తున్నాడు

ఒకరోజు ..

"అయ్యా..నేను బడికి పోతానే" గారాబగా అడిగింది ఆ చిన్నారి మనసు.

"ఓరె ఎధవ నా కొడకా . మనకి బడెందుకురా, మనక్కావలసింది పశువుల దొడ్డికాని. పిచ్చి సన్నాసి నువ్ సదువుకొని దేశాన్ని ఉద్దరిస్తావేంట్రా. ఆ బళ్ళు ఆ గుళ్ళు అన్నీ పెద్ద మహరాజులకు కాని మామూలు మడుసులకు కాదు దొరలకు దొరకొడుకులకు కాని మన కేంట్రా సదువు. విన్నావె మనోడికి చిత్ర విచిత్రమైన కోరికలు పుడుతున్నాయె. వెధవసన్నాసి ఎళ్ళసె. ఆ దొరసానమ్మగోరు గొడ్లు ఇడవాలంట ఎళ్ళాల్ళు". అని తరిమి ఆ దొరసాని దొడ్లోకి పంపేడు. మా అయ్యకి ఎంతసేపు ఆదొరసానమ్మ ముచ్చటే తప్ప మరొకటి వుండదు. నేను సదువుకోవడం మా అయ్యకి ఇష్టంలేదేమో. ఈ సదువులు, ఈ బళ్ళు ఆ ఉన్న మా రాజుల దేనా? నేనెందుకు సదువుకోగూడదు? పరిపరి విధాలుగా ఆలోచిస్తూ ఆ బహిరంగ సభలో చివర్లో నిలుచున్నాడు వెక్కి వెక్కి ఏడుస్తూ.

"ఇపుడు మీ ముందు గ్రామ యువజన సంఘ అధ్యక్షుడు రాంబాబు మాట్లాడతారు"! ఎవరో పెద్ద మనిషి స్పీకర్ ముందు కొచ్చి చెప్పాడు రాంబాబు పేరు వినగానే ఆ సభ అంతా చప్పట్లతో మ్రోగిపోయింది. యువకులంతా ఈలలు వేస్తున్నారు. ఇదంతా వింతగా చూస్తున్నాడు మల్లి. నెమ్మదిగా క్రింద కూలబడ్డాడు చేతకాని వాడిలా. వేదిక పైకి తెల్లటి లాల్చి, పైజామా వేసుకుని రాంబాబు చేతులూపుతూ వచ్చాడు. అందరి వైపు చిరునవ్వుతో చూశాడు.

"జై బోలో స్వతంత్ర్య భారత్‌కి !" అని గట్టిగా అరిస్తే కూర్చున్న వాళ్లంతా "జై" అన్నారు. అటు వైపు తదేకంగా చూస్తున్నాడు మల్లి. సభ అంతా నిశ్శబ్దంగా తయారయింది.

"గౌరవ అధ్యక్షా, గ్రామ పెద్దలు మరియు సోదర సోదరీ మణులారా ! ఈరోజు మనకు స్వాతంత్ర్యం వచ్చిన రోజని దాదాపు అందరికీ తెలుసు. ప్రతి సంవత్సరం ఇలా జరుపుతూ ఈ వేదికలపై ఇలా మాట్లాడటం పరిపాటైపోయింది. మనకు స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 38 ఏళ్లు కావస్తుంది. మనం ఆనాడు తెల్ల దొరల పాలన నుండి విముక్తి పొందాం అంటే, వారి బంధాలను తెంచుకున్నాం అంటే, ఆనాడు మహాత్మా గాంధీలాంటి నాయకులెందరో, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ ల్లాంటి వారెందరో తమ ప్రాణాలను అర్పిస్తే ఈనాడు మనం స్వతంత్రంగా బ్రతుకుతున్నాం. ప్రతి సంవత్సరం ఈ వేదికపై ఇలాంటి మాటలనెన్నో వల్లిస్తున్నాము. మరి ఆనాడు తెల్ల దొరల పాలనలో పోరాడి వారి బానిస బంధనాలను తెంచుకున్నాం, మనకు స్వాతంత్ర్యం వచ్చాక ఈ నల్ల దొరల బానిసలకు బందీలమై ఉన్నాము!" ఉద్రేకములో, ఆవేశ పూరితంగా మాట్లాడుతున్న అతని వైపు, వేదిక మీద కూర్చున్న గ్రామ పెద్దలు విషపుచూపులు విసిరారు. వేదిక క్రింద కూర్చున్న యువకులంతా చప్పట్లతో అతన్ని బల పరుస్తున్నారు.

"నా తెలుగు సోదరులారా, మనకు స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా మనం సాధించిన ప్రగతి ఎక్కడుంది? ఈ దేశంలో ఇంకా దరిద్ర్యం విలయతాండవంచేస్తోంది. నిరుద్యోగం స్వైర విహారం చేస్తోంది. ఆకలితో ఎంతో మంది పేదవాళ్ళు అలమటించిపోతున్నారు. ఈనాడు ఈ దేశంలో ఈ పేదరికం, ఈ దరిద్రం పెరిగిపోతుందంటే ఈ స్వార్థపరులైన ఖద్దరు బట్టల నాయకులే కారణం !"

రాంబాబును ఈసారి నిప్పుతవ్వలు రాలే విధంగా చూశారు, వేదికమీద ఉన్న నాయకులు. అతను ఆగకుండా ఆవేదనతో ఉపన్యసిస్తున్నాడు.


"ఉదాహరణకు ఇపుడు మన గ్రామం తీసుకోండి. మనఊళ్ళో పేదప్రజల పిల్లలు బడికి రాలేనిస్థితిలో ఉన్నారు. మనఊళ్ళో వీధిలైట్లు లేవు, నీటిసౌకర్యం లేక మనం పడుతున్న ఇబ్బందులు మీ అందరికి తెలిసిందే. మన దేశానికి స్వతంత్ర్యం వచ్చిందేమోకాని మన వూరికి ఇంకా స్వాతంత్ర్యం రాలేదు. ఈ దేశంలో ఉన్న ప్రతి ఊరిలో పేదప్రజల బాధలు తీరినపుడే, కష్టజీవుల కన్నీళ్ళు తొలగినపుడే మనకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు. జైహింద్ !" అంటూ ముగించాడో లేదో ఆ సభలో చప్పట్లు ఊరు అదిరిపోయేలా మ్రోగిపోయాయి.

ఎందుకో తను కూడా సంతోషముతో నవ్వుతూ, తెలియని ఆనందముతో, అందరూ కొట్టడం ఆపినా తనుమాత్రం ఆగకుండా చప్పట్లు కొడుతున్నాడు, అరచేయిలో ఉన్న నొప్పిని విస్మరించి అలాగే కొడుతున్నాడు. అతను మాటాడుతుంటే తనలో ఏదో తెలియని ఉత్సాహం పెల్లుబికింది.

"ఇంతటితో ఈ సభ ముగించటం జరుగుతోంది. ఇపుడు మన విద్యార్థినిలు జాతీయ గీతాన్ని విన్పిస్తారు !" సభలో కూర్చున్నవారంతా లేచారు. పిప్పరమెంట్లు ఇవ్వడైనా ఇస్తారేమో నని ఉత్సుకతతో లేచాడు మల్లి.

"జనగణమన అధినాయక" అనే పాటను పాడుస్తున్నారు మరో ఇద్దరమ్మాయిలు. సభ ముగిసింది ఆ పాటతోనే కాబోలు ఎవరింట్లోకి వారు వెళుతుంటే "పిప్పరమెంట్లు ఇవ్వరేమో" నని కోపంగా చూశాడు.

"ఎలాగైనాసరే రాంబాబుగారిని కల్సుకొని నా సంగతంతా చెప్పి నన్ను బళ్ళో చేర్పించమని, కాళ్ళావేళ్ళా పట్టుకొంటాను. ఆ బాబుగారు నన్ను అసహ్యించుకుంటారా ? లేదు, అతడేగదా 'పేదోళ్ళపిల్లలు బడికి రాలేకపోతున్నారని చెప్పాడు" అలా మనసులో ఒక నిర్ణయానికి వచ్చి, ఆయాసంతో వున్న తన శరీరంలోకి శక్తినంత కూడదీసుకుని మెల్లిగా వేదికవైపు రావడానికి ప్రయ



త్తిస్తున్నాడు. కాళ్ళు నొప్పులో ఉండి నడవడానికి సాధ్యం కావట్లేదు.

అతని ఎదురుగా ఇద్దరు యువకులతో వస్తున్న రాంబాబు కనిపించాడు. తన కాళ్ళల్లో నొప్పి తగ్గినట్టయింది. ఆత్రుతగా వెళ్ళి అతని కాళ్లపై పడ్డాడు. వెక్కి వెక్కి ఏడుస్తూ బిగ్గరగా పట్టుకున్నాడు. అతని వెంటవున్న ఇద్దరు యువకులు కళ్ళు పెద్దవిగా చేసుకుని ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"లే బాబూ...లే... ఏం జరిగింది. లె చెప్పు బాబు..." కరుణతో నిండిన అతని చేతులు మల్లిని లేవదీసాయి.

"బాబుగారండి బాబుగారండి"! దుఃఖాన్ని మరింత కూడదీసుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. తను వచ్చే దుఃఖాన్ని మరింత రెట్టింపుగాచేసి తన గోడునంతా అతనికి తనివి తీరా చెప్పాలనిపించింది. ఇన్ని రోజులనుండి దాగివున్న ఆ కోరికను కొండంత పెద్దదిగా చేసి మనసునిండా చెప్పాలని ఉంది. తన బాధనంతా అతని మనసు కరిగేలా చెప్పాలనిపించింది.

"చూడు బాబు... నీకేంకావాలి చెప్పు. పిప్పర్‌మెట్లు కావాలా, మిఠాయిపొట్లం కావాలా. ఏమయిందో చెబితే అవన్నీ తెచ్చిస్తాను!" ఆప్యాయతతో చెరిగిపోయిన ఆ జుత్తును నిమిరి దగ్గరకు హత్తుకున్నాడు. "మా అయ్యకూడా ఇంత పేమతో ఎప్పుడూ దగ్గరకు లాక్కులేదూ. ఎంత మంచి మనసు బాబుగోరిది. నన్నింతవరకు ఇంత పేమగా ఎవరూ హత్తుకోలేదు." ఆ చిన్నారి గుండె సంతోషముతో ఎగిరిపడింది.

"బాబుగారు... నే...నే...నేనేమో.. బడికి వెళ్తానన్నాను.

మా .. అ... అయ్యేమో... బడికి... వద్దని... బాగా తాటిమట్టతో... కొ... కొట్టాడు!" బోరుమన్నాడు. బొబ్బలెక్కి ఎర్రగా నిప్పుకణంలా ఉన్న అతని చేతిని చూసి కళ్లెర్రజేసాడు. అతని ప్రక్కనే ఉన్న వాళ్ళు చిత్తరపోయి వింటున్నారు.

"మరి... ఈ... వేళ... ఏదో పండగంట.. ఆ... అందుకని.. నేను పనికిపోను అంటే... మా... అయ్యమో పనికిపొమ్మని .. ఆ తాటిమట్టలో నెత్తురొచ్చేలా కొట్టాడు!" చిరిగిపోయిన ఆ చొక్కాను పైకి లేపి చూపించాడు. ఆ వీపుపైన ఆ తాటిమట్ట వేసిన ముద్రలున్నాయి. ఆ వాతలు చూసిన రాంబాబు మొహం ఎర్రగా మారింది. ఉద్రేకమంతా కళ్లల్లో కూడుకుపోయింది. ఒకసారి ఆ మల్లిగాడివైపు దీనంగా చూశాడు. అతని కళ్లల్లో ఏడ్చి ఏడ్చి తేలియాడిన రక్తకణాలు చూసి పళ్ళు కొరికాడు.

"ఒరే... ఈ దేశములో ఇంకా అంధకారం చోటు చేసుకొని వెలిగే జీవితాల్ని కప్పేస్తున్నాయి. ఈ బాబు నెలాగైనాసరే స్కూల్లో చేర్పించి, ఆ బానిస కబంధహస్తాలనుండి విముక్తి చేస్తే వీడు భవిష్యత్తులో దేశానికి ఓ వెలుగు కిరణమై ప్రకాశించవచ్చు. ప్రకాశించబోతున్న ఇలాంటి వజ్రాలు మట్టితో కప్పబడుతున్నాయి, పదండి" ఆవేశంగా సెగలు కక్కుతున్న చూపులతో ఉద్రేకంగా అరిచాడు.

"బాబుగారండి . మా అయ్యతో సెబితే.. మళ్ళీ నన్ను కొడతాడేమో!" జీరవోయిన కంఠముతో పలికాడు.

"చూడు బాబు ... మీ అయ్య నిన్ను కొట్టకుండానే చెబుతానులే... పద!" గుడిసెలవైపు దారి మళ్లించారు.

"బాబుగారు. సొతంత్రం అంటే ఏమిటి!" అమాయకంగా ప్రశ్నించిన మల్లివైపు చూసి ఓ నవ్వు నవ్వాడు రాంబాబు.

"స్వతంత్రం అంటే నువ్వు రోజు పోతున్నావే పనికి, ఆ పని మానేసి చదువుకుంటే అది సొతంత్రం అన్నమాట!"

"నిజంగానా బాబుగారూ" నమ్మలేనట్టుగా అడిగాడు.

అలా మాట్లాడుతూ ఆ గుడిసెల దగ్గరికి చేరుకున్నారు. మల్లిగాడి వెంట వస్తున్న రాంబాబుని, అతని మిత్రుల్ని ఆశ్చర్యంగా చూస్తున్నారు ఆ గుడిసె వాసులు. వారి వెంట నక్కి నక్కి వస్తున్న మల్లిగాడ్ని గుడ్లప్పగించి చూస్తున్నారు.

వాకిట్లో కూర్చొని చిన్నపాటి బోరెలో బియ్యాన్ని గాలిస్తున్న మల్లిగాడి తల్లి, వస్తున్న మల్లిగాడివైపు నోరెళ్లబెట్టి నమ్మలేనట్టుగా చూస్తుండిపోయింది.

"ఏమ్మా ... మీ ఆయన ఏడీ!" రాంబాబు పిలుపుతో ఉలిక్కిపడ్డట్టు నఖశిఖ పర్యంతంగా చూసింది. ఏమి చెప్పాలో అర్థంకాక మల్లిగాడివైపు వింతగా చూసింది.

"లేడండి బాబుగారు. ఆ దొరసానమ్మ పొలంకాడికెళ్లాడు" సమాధానం చెప్పేసి తన పనిలో నిమగ్నమయింది.


"మీ బాబుని, మా యువజన సంఘం స్వయంగా ఖర్చులు భరించి, బళ్లో చేర్పించి చదువు చెప్పిస్తాము. నీకెమైనా అభ్యంతరమా?"


ఆ మాటలు విన్న ఆమె మొహం తెల్లబోయింది. రాంబాబువైపు భయంగా చూసింది. మల్లిగాడు సంతోషముతో పళ్ళు బయటపడేలా నవ్వు మొహం పెట్టాడు.

"ఈ బాబుగోరు నన్నెలాగూ బడికి పంపించేత్తారు. నేనేమో పెద్ద చదువు చదివి పెద్దవాడ్నై ఏదైన కొలువు చేస్తాను. ఈ బాబుగారు నా జీవితానికి సొతంత్రం తెస్తున్నారు!" మనసులో చెప్పరాని అహంకారముతో ఎగిసి పడుతున్నాడు.

"చూడండి బాబుగారు, మాబోటివాళ్లకు సదువులెందుకండి మాకు ఒక్కగానొక్క పోరడు. వాడు మా కళ్ల ఎదుట ఉండి, మేము తినే దాంట్లో రెండు ముద్దలు తిని తృప్తి పడితే, మాకు అంతే సాల్లేండి. వద్దు బాబు మా వాడికి లేనిపోని ఆశలుపెట్టి, వాడ్ని మా నుండి దూరం చేయకండి. మా ఆయన అసలే వెర్రోడు, కోపం వత్తే వాడ్నేమి సేసినా సేసేత్తాడు, పొద్దున్నే చావబాదాడు. నేను అడ్డం తిరిగితే నన్ను కొట్టాడు" చివరి మాటల్లో దుఃఖము కొట్టుకొచ్చింది. ఆమె చెబుతున్నంతసేపు శ్రద్ధగా విన్నారు. ఆమెకు ఎలా చెబితే వింటుందో అర్థంకాక సతమతమవుతున్నాడు.

"చూడమ్మా ... మీ మల్లి మీ కళ్లముందే ఉంటాడు. ఈ రోజుల్లో కాస్తో కూస్తో చదువుకుంటే వాడికి జ్ఞానం వస్తుంది. పెద్దగా ఎదిగిన తరువాత వాడి కాళ్లమీద వాడు నిలబడి,






వాడి బ్రతుకువాడు సరిదిద్దుకోగలడు. మీరిలా వెట్టి చాకిరీ పనులకు పెట్టొద్దనుకోండి, వాడి జీవితమంతా వెట్టిచాకిరీ పాలవుతుంది. చిగురించే మొక్కల్ని, మీరలా కావాలని విరిచివేయకండి !'' ఇలా ఎన్నెన్నో మాటల్తో ఆమెకునచ్చేవిధంగా చెప్పాడు. ఇతడు చెప్పిన ప్రతి మాటలో నిజముందని గ్రహించినా ఆమె మనసు ఒప్పుకోవడం లేదు. చివరికి తనేం చేయలేనట్టుగా

''మా ఆయన్ని అడగండి !'' సరిపుచ్చేసింది.

రాంబాబు ఏమి చేసేదిలేక ''చూడు మల్లీ, నీవు రేపు పొద్దున్నె నా దగ్గరకు వచ్చేసెయ్, నేను బడి దగ్గరే నిల్చుంటాను. నిన్ను హెడ్ మాస్టర్ దగ్గరకు తీసుకెళ్లి మాట్లాడి, నిన్ను బడిలోచేర్పిస్తాను. కొత్త పలక, బలపము, బట్టలు అన్నీ నేనే ఇస్తాను !'' అని చెప్పి వెళ్లిపోతున్న రాంబాబు వైపు అదోలా చూశాడు మల్లి.

''నా బతుకులో సాతంత్రం తెచ్చేస్తున్నారు రాంబాబుగారు. నేను ఇకనుంచి రోజు బడికి పోతాను, అందరితోపాటు ఆడుతూ పాడతాను!'' పట్టలేని ఆనందములో పరవళ్లు త్రొక్కుంది ఆ చిన్నారి మనసు ఒక్క వుదుటున ఆ వాడలోకి పరిగెత్తి—

''నేను బడికి పోతున్నాను. నేను కూడా సదువుకుంటున్నాను. నన్ను రాంబాబుగారు సదివిత్తన్నారు.'' అందరికి చెప్పేస్తూ గంతులు వేస్తూ ఎగురుతున్నాడు.

''నాకు సాతంత్రం వచ్చింది'' అంటూ అరుస్తున్న మల్లిగాడ్ని అందరూ పిచ్చివాడిలా చూస్తున్నారు.

ఆ చిన్నారి మనసులో చిరుదివ్వెలు వెలిగాయి. ఆ చిన్నారి కేరింతలు వింటూ, ఆ చిన్నారి గంతులు చూస్తూ నవ్వుతూ అస్తమించాడు సూర్యభగవానుడు

* * *

అతి కష్టం మీద సూర్యుడు ఉదయిస్తూ మబ్బుల చాటుకు చేరుకుంటున్నాడు. ఆ వూరిని చూడాలన్న ఇష్టం లేనట్టుగా కోపంతో మబ్బుల చాటు దాక్కుంటున్నాడు. నీలిరంగు ఆకాశం మేఘావృతమయింది., మబ్బులు వేగంగా పరిగెత్తుకుంటూ వస్తు ఆకాశాన్ని కప్పివేస్తున్నాయి. నెమ్మదిగా వీస్తున్న గాలి చాలా ఉధృతమైంది. వర్షం పడుతుందేమోనన్న కంగారుతో మాస్టార్లంతా నడక స్పీడు హెచ్చించి స్కూల్లోకి వెళుతున్నారు. ఆ స్కూలు ముఖద్వారం వద్ద వెక్కిళ్లు వినపడుతుంటె, అసహ్యంగా చూసి నవ్వుకుంటూ లోపలికి వెళుతున్నారు పిల్లలు. ఆకాశంలో మెరుపుల దాడి పెరిగింది. ఆ ఊరు నిండా మసకచీకటి సంతరించుకొంది.

బహుశా అప్పుడు 8 గంటలయి ఉండవచ్చు. రాంబాబు రాకకోసం వేయి కనులతో ఎదురు చూస్తున్నాడు మల్లి. తెల్లబట్ట లేసుకున్న వాళ్లెవ్వరు కనిపించినా రాంబాబు గారేమోనని భ్రమపడిపోతూ అంతలోనే నిరాశకు గురి అవుతున్నాడు. ఈరోజు కూడా వాళ్లయ్య కొట్టాడేమో, బాధతో మూల్గుతూ ఏడుస్తున్నాడు.

''రాంబాబుగారు వస్తారు. నాకు కొత్త పలక, కొత్త బట్టలు, కొత్త బలపం తెస్తారు. నన్ను బళ్లొ చేర్పిస్తార'ని గంపెడు ఆశతో ఎదురు తెన్నులు చూస్తున్నాడు. ఇంతలో ఏదో అలజడి వినిపించింది. ఆ అలజడి ఊరంతా ప్రాకింది కాబోలు, అందరూ బిక్కమొహాలు వేసి 'పాపం' అంటూ సానుభూతి తెలుపుతున్నారు. ఆ వార్త మల్లిగాడి చెవుల్లో కుండ పగిలినంత గట్టిగా వినపడింది. జరుగరాని ఘోరం జరిగి పోయింది.

మల్లిగాడి మనసులో నిప్పుసెగలు బయలు దేరాయి. గుండెల్లో గునపాలు దించినంత బాధయ్యింది. తన గుండెల్లో ఎవరో కాగడాతో మంటలు లేపుతున్నారు. శరీరంలోఉన్న ప్రతికణం పగిలి బ్రద్దలు అవుతోంది. ఒక్కసారే దిమ్మ తిరిగింది కాబోలు తలను బిగ్గరగా అదిమి పట్టుకున్నాడు.

## జోల

జో పాపా జో
పసితనం అమాయకత్వం
పరుగులిడి పోకముందే
పడుకోక్కగలవు హాయిగా
క్షణంలో తెల్లారిపోతుంది
సంగ్రామం మొదలౌతుంది బ్రతుకుతో
సమయం దాటిపోకముందే
చక్కా పడుకో్క నిశ్చింతగా
అల్లరి బ్రతుకు బాధల చీకట్లు
అల్లుకున్నాక రాదు సుమీ నిద్ర
మనిషిగా ఎదిగిపోకముందే
తనివితీరా పడుకో్క ■జో పాపా జో■

—వఝల కాళిదాసు

''రాంబాబుగారు !'' అంటూ వూరు అదిరిపడేలా కేకవేసాడు. ఆ కేకలో కొన్ని కోట్ల గొంతుల అర్తనాదాలు వినిపించాయి. కాళ్ళు గడగడలాడి పోతున్నాయి. చేతులు రెండు ఉద్రేకముతో ఊగిపోతున్నాయి. తన కళ్ళను ఎవరో పీకి వేసినంత బాధయింది. దిక్కుతోచనట్టుగా తన కళ్ళు బెదిరి బెదిరి చూస్తున్నాయి. తన కళ్ళకు ఏమి కన్పించటంలేదు. అంతా శూన్యం. అంతా చీకటే కన్పిస్తుంది.

ఏదో జరుగరాని, జరుగలేని ఘోరం జరిగిపోయింది. ఇక నా బతుకు ఎట్టి బతుకేనేమో, నేనిక బడికిపోనేమో, ఆ దొరసానమ్మ దొడ్లో పేడకుప్పలు తీయాలేమో, తన బ్రతుక్కి ఇక వెలుగులేదేమో అంతా చీకటే.

ఈ ఊరంతా వరదల్లో కొట్టుకుపోతే బాగుండేది. ఈ ఊరంతా మంటల్లో ఆహుతి అయితే బాగుండేది. ఊళ్ళో మనుషులు, పక్షులు పశువులు అన్నీ చచ్చిపోతే బాగుండనుకున్నాడు.

అక్కడ్నుండి పరుగు లంఘించాడు. ఊరు అవతల ఉన్న పెద్ద మర్రిచెట్టు, దాని ప్రక్కనే ఓ పెద్ద బొంద, ఆ బొందలో రాంబాబుగారు నెత్తుటి మడుగులో నిద్దరోతున్నారు.

అంతా అక్కడ గుంపుగాజేరి ఆ నూతిలోకి తొంగి చూస్తున్నారు. అందర్ని ప్రక్కకు చిల్చుకుంటూ ముందుకువెళ్ళాడు చిన్నారి మల్లి. ఆ నెత్తుటి మడుగును చూసేంత శక్తిలేక తన కళ్ళను ఒక్కసారి గట్టిగా మూసుకున్నాడు.

మరొక్కసారి ''రాంబాబుగోరు!'' కొండలు పిక్కటిల్లేలా, ఆకాశం అదిరిపోయేలా, భూమి కంపించే విధంగా అరిచాడు. ''లేదు. లేదు. మనూరికి సాతంత్రం రాలేదు. మనూరికి వెలుతురులేదు...ఈ వూరంతా పాడైపోయింది !'' గట్టిగా అరుస్తున్నాడు పిచ్చెక్కినవాడిగా.

మల్లిగాడి శరీరమంతా మంటలు మంటలుగా సెగలు సెగలుగా ఎగిసి పడుతోంది. ★